# బీఆర్ఎస్‌తోనే భరోసా



పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా వస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 15 : బీఆర్ఎస్ పాలనపై ప్రజలకు భరోసాగా ఉంటుందని, పదేండ్లలో సీఎం కేసీఆర్ సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గోనెల గాయత్రి భవానీ, రాజేశ్వరి, లావణ్య, లక్ష్మి, యాదమ్మ, సరస్వతి, మంగమ్మ, నరేశ్, రమణ, శ్యామ్, నిరంజన్, రాము, రాజేశ్, సాయికిరణ్‌తోపాటు 50 మందికిపైగా మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు అలవి కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. 60ఏండ్ల పాలనలో ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. అమలు హామీలు ఇస్తున్న నాయకులు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణలోని పథకాలు, అభివృద్ధి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో రూ.200ల పింఛన్ ఇస్తుండగా, తాము అధికారంలోకి వచ్చాక పదింతలు చేసి ఇచ్చామన్నారు. మిషన్ భగీరథతో నట్టింట్లోకి తాగునీరు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి ఇలా చెప్పుకుంటూపోతే రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం అందని ఇల్లే లేదని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజక్టు ద్వారా ఉమ్మడి పాలమూరు సస్యశ్యామలం అవుతుందని వెల్లడించారు.

- దేశానికే ఆదర్శంగా తెలంగాణ పాలన
- ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం
- కాంగ్రెస్, బీజేపీలతో ఒరిగేదేమీలేదు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు
- అమ్మవారికి మంత్రి ప్రత్యేక పూజలు

### బీజేపీ చేసింది శూన్యం..

దేశంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి దూసుకుపోతున్నదని.. అలాంటి రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీకి సింగిల్ స్థానం కూడా దక్కదని బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు గోనెల గాయత్రి భవాని తెలిపారు. బీజేపీ ఎన్నాళ్లు ఉన్నా ఎలాంటి అభివృద్ధి సాధ్యం కాదని బీఆర్ఎస్‌లో చేరామన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, గోనెల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి..

పాలమూరు, అక్టోబర్ 15 : రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్తగంజి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి మంత్రి ఊరేగింపుగా వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులను విడుదల చేశామని, పనులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, లక్ష్మీనర్సింహస్వామి దయతో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి కోరారు. అనంతరం కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ చంద్రమౌళి, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాజేశ్వర్, నాయకులు రామకృష్ణ, వర్ద భాస్కర్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## సీఆర్‌పీఎఫ్ మహిళా జవాన్ల బైక్ ర్యాలీ

కొత్తకోట, అక్టోబర్ 15 : రాష్ట్రీయ ఏక్తా దివస్ దృష్ట్యా సీఆర్‌పీఎఫ్ సెంట్రల్ ఫోర్స్ మహిళా అధికారులు 60బైక్‌లతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈనెల 5వ తేదీన కన్యాకుమారి నుంచి బైక్‌ర్యాలీని ప్రారంభించగా, ఈనెల 31వ తేదీన గుజరాత్‌లోని ఖివాడియా ప్రాంతానికి చేరుకోనున్నట్లు డిప్యూటీ కమాండర్ సుమ తెలిపారు. ఐకమత్యాన్ని చాటేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి వారికి ఘనస్వాగతం పలికారు. 150 మంది సీఆర్‌ఎఫ్ జవాన్లు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భార్గవి, సింధూన, సునీల్, శ్రీరంగన్, ఎస్సై మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లకు స్వాగతం పలుకుతున్న కొత్తకోట సీఐ, ఎస్సై

# బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు



బీఆర్ఎస్ జెండాతో కార్యకర్త ఆనందోత్సాహం

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 15 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గులాబీ బాస్, సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలు గుండెల్లో గుబులు మొదలైందని.. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బీఫాం అందుకున్న సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్ వద్ద గల బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులు పెద్దఎత్తున సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలువడం ఖాయమని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని విధంగా అభివృద్ధి చేసిన మంత్రిని ప్రజలంతా అండగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహులు పేర్కొన్నారు. సబ్బండ వర్ణాల ఆశీర్వాదంతో ముచ్చటగా మూడోసారి చారిత్రాత్మకమైన విజయం సాధిస్తారని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, కౌన్సిలర్ కిశోర్, నర్సింహులు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదీప్‌రెడ్డి, నాయకులు రామకృష్ణ, పరమేశ్, బాలు ముదిరాజ్ పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభకు ముమ్మర ఏర్పాట్లు



జడ్చర్లలో హెలీప్యాడ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

జడ్చర్ల, అక్టోబర్ 15 : సీఎం కేసీఆర్ ఈనెల 18న జడ్చర్లకు రానున్న నేపథ్యంలో ప్రజా ఆశీర్వాద సభకు సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జడ్చర్ల శివారులోని గంగాపూర్-కల్వకుర్తి రోడ్డు సమీపంలో భారీ బహిరంగ సభకు ఏర్పాటు చేస్తున్నారు. వేదికకు వెనుక భాగంలో హెలిక్యాప్టర్‌ను ల్యాండ్ చేసేందుకు హెలీప్యాడ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో విస్తృతంగా తిరుగుతూ ఆశీర్వాద సభకు ప్రజలు వచ్చేలా ఇంటింటికీ తిరిగి చెబుతున్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల బహిరంగ సభను జడ్చర్ల నుంచే ముఖ్యమంత్రి ప్రారంభించనుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

## బోనులో చిక్కిన చిరుత

- రాకొండలో బోనులో బంధించిన ఫారెస్ట్ అధికారులు
- హైదరాబాద్ జూపార్కుకు తరలింపు



క్రేన్ సాయంతో బోనులో ఉన్న చిరుతను తరలిస్తున్న అధికారులు

మరికల్ అక్టోబర్ : మరికల్ మండలంలోని రాకొండలో చుట్టుపక్కల చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు వారం రోజుల కిందట బోనును ఏర్పాటు చేశారు. అదివారం తెల్లవారుజామున బోనులో పడిన చిరుత అరుపులు చేయగా, గ్రామ ఉపసర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి అటవీశాఖ అధికారి వీణావాణి, రెయింజ్ అధికారి రఘునాథ్‌రెడ్డికి సమాచారం అందించారు. అధికారులు వచ్చి బోనును క్రేన్ సాయంతో వాహనంపైకి ఎక్కించి హైదరాబాద్‌లో జూ పార్కుకు తరలించారు. బోనులో చిక్కిన చిరుతను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

## అనుచిత పోస్టులు పెడితే చర్యలు

- నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట, అక్టోబర్ 15 : సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. ఆదివారం ఆయన ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయంగానూ, కుల, మత, ప్రాంతీయంగా ప్రజల భద్రతకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు షేర్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగేలా, ఒక వర్గాన్ని కించపరిచేలా పోస్టులు చేసినా, ఇతరులకు ఫార్వర్డ్ చేసినా గ్రూపు అడ్మిన్‌ను బాధుడిని చేస్తూ ఫార్వర్డ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సామాజిక మాధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

## తనిఖీల్లో రూ.2లక్షలు స్వాధీనం

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 15 : అడ్డాకుల పోలీసులు టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.2లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని శాఖాపూర్ శివారులోని ఎల్అండ్‌టీ ఆంధ్ర వెస్టన్ టోల్‌గేట్ వద్ద ఆదివారం తనిఖీలు నిర్వహించగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తూ వ్యక్తి వద్ద రూ.లక్ష, వనపర్తి నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న మరో వ్యక్తి వద్ద రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సోమవారం జిల్లా ట్రెజరీ అధికారులకు నగదును అప్పించనున్నట్లు తెలిపారు.

### రూ.90వేల సీజ్

కృష్ణ, అక్టోబర్ 15 : మండలంలోని గుడెబల్లూర్ పంచాయితీ పరిధిలోని తెలంగాణ- కర్ణాటక సరిహద్దు బార్డర్ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం వాహనాల తనిఖీల్లో సైదాపూర్ నుంచి రాయిచూర్ వెళ్తున్న రమేశ్ కారులో రూ.90వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు. అలాగే దాబాలపై దాడులు నిర్వహించి రూ.4వేల విలువ గల మందుబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.